సాక్షి చిత్తూరు

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024

I



చెరువులను చెరబడతారా ?

పలమనేరులో ఎక్స్‌ప్రెస్ హైవే అధికారుల చర్యలతో చెరువుల రూపురేఖలు లేకుండా పోతున్నాయి. - IIలో



నలుగురికి తీవ్ర గాయాలు

ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయిన కారును రెండు బైక్‌లు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. - IIలో



అర్జీల వెల్లువ

నగరిలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున విచ్చేసి సమస్యలను ఏకరువు పెట్టారు. - IIలో

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేలపై తప్పులు మోపుతున్న చంద్రబాబు

నగరి: ముఖ్యమంత్రి చంద్రబాబు తాను చేసిన తప్పులను తన సొంత పార్టీ ఎమ్మెల్యేలపైనే మోపుతున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీమంత్రి ఆర్కే రోజా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్న తర్వాత తొలి సమావేశంలో కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో ''మాది పొలిటికల్ గవర్నెన్స్, మావారు చెప్పిందే చేయండి'' అని చెప్పి విచ్చలవిడిగా దందాలకు, అరాచకాలకు ఆజ్యం పోశారన్నారు. ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చేసరికి ఆ తప్పులను తన మీడియా ద్వారా వారి ఎమ్మెల్యేలపై నెడుతూ ప్రచారం చేయిస్తున్నారని చెప్పారు. తన తప్పులు, తన కుమారుడు లోకేష్ దందాలను చర్చకు రానివ్వడం లేదన్నారు. బాబుకు మన, తన అనేవి ఉండవని విమర్శిస్తూ తన ఎక్స్ ఖాతాలో రోజా పోస్ట్ చేశారు.

జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా రాఘవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా రాఘవులు నియమితులయ్యారు. గురువారం జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా పశుసంవర్ధక శాఖలో ఎస్టేట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ సైనికులకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. యువత సైన్యంలో చేరి దేశ భవిష్యత్ కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ఆ శాఖ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 79,753 మంది స్వామివారిని దర్శించుకోగా 29,623 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం అవుతుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో లభిస్తోంది.

సూర్యప్రభ వాహనంపై మలయప్ప స్వామి (ఇన్‌సెట్) చంద్రప్రభ వాహనంలో విహరిస్తున్న స్వామివారు



సూర్య,చంద్ర ప్రభ..

శేషాద్రివాసుడి శోభ



సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడైన ఆదిత్యుడిపై అభిషేక ప్రియుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు ఆయురారోగ్యప్రాప్తిని ప్రసాదించాడు. నక్షత్రాలకు అధిపతి, ఆహ్లాదకారి అయిన చంద్రుడిపై చల్లనయ్య శ్వేత వర్ణ కలువల అలంకరణలో కొలువుదీరి, భక్తలోకానికి తన దివ్య మంగళ రూపంలో దర్శనమిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజైన గురువారం శ్రితపరిపాలకుడైన తిరువేంకటనాథుడికి సూర్య, చంద్రప్రభ వాహనసేవలు వైభవంగా సాగాయి.

బ్రహ్మోత్సవాల్లో బ్రహ్మాండనాయకుడు

- ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై శ్రీవారు
- తిరుమంజనంలో సేద తీరిన దేవదేవుడు

తిరుమల: శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. గురువారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై మలయప్ప స్వామి భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఉదయం సూర్యకాంతుల నడుమ భాస్కరునిపై వేంకటపతి బద్రి నారాయణ అలంకారంలో స్వర్ణ కాంతులీనుతూ భక్తులను కటాక్షించారు. సూర్య ప్రభ వాహనంలో చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ భక్తులు వర్షంలోనే నిల్చుని మలయప్పస్వామి దర్శించుకున్నారు. వర్షానికి స్వామివారిని ఛటాటోపం కింద తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపంలో బ్రహ్మోత్సవాల్లో మూడో స్నపన తిరుమంజనంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు సేద తీరారు. ఈ సందర్భంగా వేదికను సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. విశేషమైన కిరీటాలు, పండ్లు, పుష్పాలు, నవధాన్యాలతో తయారు చేసిన కిరీటాల అలంకరణలో ఉత్సవమూర్తులు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయం వెలుపల సహస్రదీపాలంకరణ సేవలో స్వామి ఊయల ఊగుతూ దర్శనమిచ్చారు. రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనసేవలో మంగళధ్వనుల, పండితుల వేద ఘోషలో చల్లనయ్య శ్వేత వర్ణ కలువల అలంకరణలో భక్తలోకానికి తన దివ్యమంగళ రూపంలో దర్శనమిచ్చారు. ఏడో రోజు వాహన సేవల్లో భక్తుల సందడి తగ్గింది. ఇక వాహన సేవల్లో కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఆలయంతోపాటు ఫల, పుష్ప ప్రదర్శనశాలలోని పుష్ప, విద్యుత్ అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాదనీరాజనం, ఆస్థాన మండపంలో కళాకారులు భక్తి, సంగీత కార్యక్రమాలు వీనుల విందు చేశాయి.







స్వామివారి సూర్య, చంద్రప్రభ వాహన సేవల సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు

మద్యం దుకాణాల దరఖాస్తుకు నేడే ఆఖరు

చిత్తూరు అర్బన్: జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారంతో గడువు ముగియనుంది. సాయంత్రం 5 గంటల్లోపు వ్యాపారులు దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. గురువారం వరకు జిల్లాలో 1,767 దరఖాస్తులు అందినట్లు అధికారులు ప్రకటించారు. కాగా ఒక దుకాణానికి ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయిస్తారు. ఈనెల 14వ తేదీన ఉదయం 8 గంటల నుంచి చిత్తూరులోని సంతపేట ఆర్ఆర్ గార్డెన్ కల్యాణ మండపంలో లాటరీ తీయనున్నారు. జిల్లావ్యాప్తంగా చిత్తూరు అర్బన్‌లో 22 దుకాణాలకు 390 దరఖాస్తులు, రూరల్‌లో 19 షాపులకు 391, కార్వేటినగరంలో ఎనిమిదికి 218, నగరిలో పదకొండుకు 174, పుంగనూరులో 14 షాపులకు 116, పలమనేరులో పదమూడుకు 150, కుప్పంలో 10 షాపులకు 276, పులిచెర్లలో ఏడింటికి 52 దరఖాస్తులు అందాయి. రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ రుసుము ద్వారా ఇప్పటి వరకు జిల్లా నుంచి ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకోవడం ద్వారా రూ.17.67 కోట్ల ఆదాయం లభించింది.

ఏఎస్పీలుగా ఉద్యోగోన్నతి

చిత్తూరు అర్బన్: తిరుపతి, చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) డీఎస్పీలకు ఏఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ.. వారిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు ఏఆర్ డీఎస్పీ ఎస్.ఇలియాజ్ బాషను అనంతపురం ఏఆర్ ఏఎస్పీగా, తిరుపతి ఏఆర్ డీఎస్పీ బి.రమణయ్యను వైఎస్సార్ కడప ఏఆర్ ఏఎస్పీగా, టీటీడీ విజిలెన్స్‌లో పనిచేస్తున్న ఆర్.శివానందకిషోర్‌ను చిత్తూరు ఏఆర్ ఏఎస్పీగా, చిత్తూరులో ఏఆర్ ఏస్పీగా ఉన్న జి.నాగేశ్వరరావును విజయనగరం ఏఆర్ ఎస్పీగా బదిలీ చేశారు.


అమ్మవారి దీవెనలు అందాలి

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు
- అమ్మవారి నామస్మరణతో మార్మోగిన వి.కోట
- 3,500 కలశాలలోని పాలతో దుర్గమ్మకు అభిషేకం



పాల కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

వి.కోట : జై భవానీ.. జైజై దుర్గా భవానీ అంటూ అమ్మవారి నామస్మరణతో వి.కోట మార్మోగింది. పట్టణంలోని శ్రీ దుర్గామాత ఆలయంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏటా నిర్వహించే పాల కలశాల శోభాయాత్ర గురువారం కనుల పండువగా జరిగింది. సుమారు 3500 మంది మహిళలతో కలిసి జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, సర్పంచ్ పీఎస్ లక్ష్మీ పాల కలశాలతో పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి చేరుకోగా అక్కడి నుంచి మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ పట్టు వస్త్రాల సారెతో ఆలయ ధర్మకర్తలు అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. పట్టణం అంతా అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. మహిళలు తెచ్చిన కలశాలలోని పాలతో దుర్గామాతకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి విజయవంతం చేయడంపై ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి పాల కలశాలతో ఊరేగింపుగా వస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

ఇసుక ఉచితం..

దోపిడీ నిజం

పేదలకు ఇసుక దొరకడం గగనం.. కారణం.. ఉమ్మడి జిల్లాలో అధిక శాతం పాయింట్లు బోసిపోవడం.. అయితే పచ్చనేతలకు మాత్రం లభ్యం .. ఇందుకు అనధికారిక రీచ్‌లే తెలుగుతమ్ముళ్లకు ఆధారం.. ఏదీ ఏమైనా ఇసుక ఉచితం.. దోపీడీ నిజం. ఇదీ జిల్లాలో సైఖతం స్థితి.

- రేణిగుంటకు చెందిన రహంతుల్లా రెండు నెలల క్రితం సొంతింటి నిర్మాణాన్ని ప్రారంభించాడు. ఇంటి నిర్మాణానికి ఇసుక దొరక్క.. ఓ సారి పిచ్చాటూరు అదవికోయంబేడులో ఓ ట్రాక్టర్, పాడిపేట సమీపంలో టీడీపీ నేతల చుట్టూ పలుసార్లు ప్రదక్షిణలు చేసి అతి కష్టంపై మరో ట్రాక్టర్ ఇసుక తెచ్చుకున్నాడు. ఇంకా రహంతుల్లాకి పది ట్రిప్పుల ఇసుక అవసరం. ఇసుక కోసం ప్రభుత్వ రీచ్‌లు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగారు. ఇసుక దొరకలేదు. చేసేది లేక ప్రస్తుతం నిర్మాణాన్ని అర్ధాంతరంగా ఆపివేశారు.

- శ్రీకాళహస్తి హౌసింగ్ బోర్డు కాలనీలో టీడీపీకి చెందిన నాయకులు అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. వీరు చుక్కలనిడిగల్లు సమీపంలోని స్వర్ణముఖి నుంచి రాత్రి సమయాల్లో జేసీబీతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా ఇసుక డంప్ చేసుకున్నారు. కూటమి నేతలు, అనుచరుల భవన నిర్మాణాలకు ఇసుక కొరత లేదు. వారికి మాత్రం కావాల్సినంత ఇసుక లభ్యమవుతోంది.



ఏర్పేడు మండలం పాతవీరాపురం వద్ద ఉన్న స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాల కోసం ఏర్పాటు చేసుకున్న రోడ్డు

ఇసుక లేదు.. పక్క జిల్లాల్లో తెచ్చుకోండి

- నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలుకు వెళ్లండి
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌ల్లో ఇసుక లేదు.. రాదు
- ఇసుక కోసం అన్వేషిస్తున్నామంటున్న అధికారులు
- చేతులెత్తేసిన అధికార యంత్రాంగం.. ఆందోళనలో వినియోగదారులు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'ప్రభుత్వ రీచ్‌ల్లో ఇసుక లేదు.. పొరుగు జిల్లాలైన నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూలు వెళ్లి తెచ్చుకోండి. ఒకవేళ ఇసుక కావాలంటే.. ప్రభుత్వం రీచ్‌లు ఏర్పాటు చేసే వరకు ఆగితే దొరుకుతుంది. అప్పటి వరకు మేమేమీ చెయ్యలేం' అని భూగర్భ గనులశాఖ జిల్లా అధికారి బాలాజీ నాయక్ తేల్చిచెప్పారు. ఇదిలా ఉంటే.. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఇసుక విషయమై సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. పెళ్లకూరు, కోట మండలాల పరిధిలో ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించినట్లు, ఆయా ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీ నేతల అనధికారిక రీచ్‌ల్లో ఇసుక ఫుల్

ఎన్నికల ముందు ఇసుకను ఉచితంగా ఇస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక జేబులు నింపుకోవడానికి ఇసుకను అక్రమంగా తవ్వి తరలించి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ల వద్ద గత 40 రోజులుగా ఇసుక కరువైంది. అయితే టీడీపీ నేతలకు మాత్రం కావాల్సినంత ఇసుక లభ్యమవుతోంది. స్వర్ణముఖి, కౌండిన్య, కాళంగి, ఆరణియార్, నీవాలో ఇసుక ఉన్నా.. అధికారులు మాత్రం స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వ చేయాలనే బాధ్యత మరిచారు. 162 కి.మీ విస్తరించి ఉన్న స్వర్ణముఖిలో అవసరమైనంత ఇసుక ఉన్నా.. అధికారులు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై నదిలో లభ్యమయ్యే ఇసుకను రాత్రి వేళలో జేసీబీలతో తవ్వి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం టీడీపీ నేతలు స్వర్ణముఖి నదీ పరీవాహక ప్రాంతంలో చంద్రగిరి, పాడిపేట, గాజులమండ్యం, పాపానాయుడుపేట, పెనుమల్లం, గోవిందవరం, కొత్తవీరాపురం, మునిలిపేడు, మోదుగులపాళెం, అబ్బాపట్లపల్లి, పుల్లారెడ్డి కండ్రిగ, అమ్మపాళెం, శ్రీకాళహస్తి, చెంబేడు, కలవకూరు, పెళ్లకూరు, నాయుడుపేట, భీమవరం, మర్లపల్లి, అన్నమేడు, చిట్టమూరు మండల పరిధిలోని గుణపాడు, కోట మండల పరిధిలోని గూడలి, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం కూడలి, గూడూరు మండలం కైవల్యానది పరివాహక ప్రాంతంలోని ఇందూరు, పంబలేరు, కాళంగి నదీ పరివాహక ప్రాంతంలో ఇల్లుపూరు, కరుణానది, అరుణానదీ పరీవాహక ప్రాంతం, నీవా నది పరివాహక ప్రాంతమైన కొట్రకోన, జీడీ నెల్లూరు, వేల్కూరు, ముక్కల తూరు, రాసమరెడ్డిపల్లి, పాతపాలెం, కౌండిన్య నది పరీవాహక ప్రాంతంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఇసుకను తవ్వి విక్రయించేందుకు ఒక్కో టీడీపీ నేత ఒక్కొక్కరికి బాధ్యతలు అప్పగించారు. ట్రాక్టర్ ఇసుకను రూ.2,500 విక్రయిస్తుంటే.. ఇందులో నుంచి రూ.1,200 సంబంధిత అధికారులకు వాటా రూపంలో పంపుతున్నారు. మిగిలిన రూ.1,300 టీడీపీ నేతలు, కాంట్రాక్టర్ పంచుకుంటున్నారు. స్వర్ణముఖి నదిలో లభ్యమయ్యే ఇసుకకు తమిళనాడు, బెంగళూరులో మంచి డిమాండ్ ఉండడంతో అధికశాతం పక్కరాష్ట్రాలకు తరలించి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్..

రాష్ట్ర ప్రభుత్వం తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఎనిమిది ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసింది. వెంకటగిరి మండలం మొగళ్లగుంట, సూళ్లూరుపేట నియోజకవర్గం దొరవారిసత్రం మావిళ్లపాడు, సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ, పిచ్చాటూరు మండలం అడవికోయంబేడు, చిత్తూరు జిల్లాలో గంగవరం మండలం నాలుగు రోడ్ల కూడలి, చిత్తూరు రూరల్ మండల పరిధిలో దిగువమాసాపల్లి, పాలూరు వద్ద ప్రభుత్వం ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఒక్క చిత్తూరు రూరల్ మండల పరిధిలో ఒక స్టాక్ పాయింట్‌లో తప్ప మరెక్కడా ఇసుక లేదు. ఇసుక లేకపోవడంతో ఆన్‌లైన్ బుకింగ్ జరగడం లేదు. చిత్తూరులో ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నా.. టీడీపీ నేతలే బినామీ పేర్లతో బుక్ చేసుకుని, అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



వెంకటగిరి మండలం మొగళ్లగుంట ప్రభుత్వ స్టాక్ పాయింట్‌లో ఇసుక లేని దృశ్యం

స్వర్ణముఖి నదిలో ట్రాక్టర్లలోకి ఇసుక నింపుతున్న వైనం



స్వర్ణముఖి నదిలో జేసీబీలతో అక్రమంగా తోడుతున్న ఇసుక



పంట పొలాల్లో ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లోకి నింపుతున్న కూలీలు



క్లుప్తంగా

నీటికుంటలో మృతదేహం



సదుం: హరినాథ్ మృతదేహం

సదుం: కొబ్బరిచెట్టు ఎక్కుతూ పడి మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని సదుం మండలంలో తెచ్చిపడేశారు. మృతుని బంధువుల కథనం మేరకు..అన్నమయ్య జిల్లా కలికిరి మండలం వీర్ల వాండ్లపల్లెకు చెందిన హరినాథ్ (47) కొబ్బరి చెట్లు ఎక్కి కాయలు దింపుతూ జీవనం సాగిస్తాడు. కలికిరికి చెందిన అల్లాబకాష్, మహమ్మద్ అలీ ఈనెల 2న కొబ్బరిచెట్లు ఎక్కేందుకు అతన్ని పిలుచుకెళ్లారు. ప్రమాదవశాత్తు చెట్టు మీద నుంచి పడి హరినాథ్ మృతి చెందాడు. దీంతో భయపడి వారు అతని మృతదేహాన్ని ఆటోలో తెచ్చి సదుం మండలం పాపిరెడ్డిగారిపల్లె సమీపంలోని ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఉన్న నీటికుంటలో పడేశారు. హరినాథ్ కనపడకపోవడంతో అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలికిరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పడేసిన స్థలాన్ని నిందితులు గురువారం పోలీసులకు చూపించారు.

సారా ఊట ధ్వంసం



సారా ఊటను ధ్వంసం చేస్తున్న అర్బన్ సీఐ జీటీ నాయుడు

కుప్పంరూరల్: 6 వేల లీటర్ల సారా తయారీ కోసం ఉంచిన ఊటను ధ్వంసం చేసినట్లు కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు తెలిపారు. గురువారం గుండ్లమడుగు, గొరివినాయనపల్లి అటవీ ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో సారా తయారీ కోసం 12 డ్రమ్ముల్లో దాచి ఉంచిన 6 వేల లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. ఆయన మాట్లాడుతూ సారా తయారీ చట్టరీత్యా నేరమని, ఎవరైనా సారా తయారు చేసినా, తయారీదారులకు సహకరించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

చెరువులను చెరబడతారా ?

పూర్వకాలంలో రాజులు ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు చెరువులను తవ్వించారు. భవిష్యత్‌పై ముందు చూపుతో తవ్వించిన ఆ చెరువులను ఇప్పుడు కొందరు నాశనం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణాలు, రియల్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాల కోసం చెరువుల్లోని మట్టిని అక్రమంగా తోడేస్తూ వాటి రూపురేఖలే లేకుండా చేస్తున్నారు. ఈ మేరకు పలమనేరు నియోజకవర్గంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డుకు సమీపాల్లో ఉన్న ఏకంగా 30 చెరువులు మాయమయ్యాయి. దీనిపై ఆయా గ్రామస్తులతో మాట్లాడితే ''ఏం చేద్దాం.. మా ఊరి పక్కన నిర్మిస్తున్న జాతీయ రహదారి మా చెరువులను మింగేస్తోంది'' అని బాధపడుతున్నారు.

- పలమనేరు నియోజకవర్గంలో చెరువుల రూపురేఖలు మార్చేస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు
- వేల లోడ్ల మట్టిని తరలించడంతో కనిపించకుండా పోతున్న చెరువులు
- అధికారులపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం
- తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశం



రూపురేఖలే లేకుండా పోయిన కొత్తిండ్లు చెరువు

పలమనేరు: నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి మండలం కొత్తఇండ్లు గ్రామ సమీపంలోని చెరువు మొన్నటిదాకా కనిపించేది. సుమారు 300మంది రైతులు చెరువు ఆయకట్టు కింద పంటలను సాగు చేసుకునేవారు. ఇదంతా గతం. ఇప్పుడు అక్కడ ఉన్న చెరువును ఎక్స్‌ప్రెస్ హైవే కాంట్రాక్టర్లు సర్వనాశనం చేసేశారు. ఇప్పుడు ఆ చెరువును చూసినవాళ్లు అసలు ఇక్కడ ఉన్న చెరువు ఏమైందా ? అని ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల ఆ మార్గంలో వస్తూ జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చెరువు పరిస్థితిని గమనించి ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి ఎక్స్‌ప్రెస్ హైవే వారిపై చర్యలు తీసుకోవాలంటూ గట్టిగా హెచ్చరించారు.

అన్నదాతల పొట్టగొట్టారు..



చెరువులోని మట్టిని భారీ యంత్రాలతో తోడుతున్న దృశ్యం

బైరెడ్డిపల్లె మండలంలోని లక్కనపల్లి చెరువు నుంచి, కొత్త ఇండ్లు చెరువు నుంచి మండలంలోనే పెద్దదైన బైరెడ్డిపల్లి పెద్దచెరువుకు నీరు చేరేది. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కారణంగా ఈ చెరువుల నుంచి వరదనీరు రాకుండా పోయింది. అంతటితో ఆగని రోడ్డు పనులు చేసే కాంట్రాక్టరు కొత్తిండ్లు చెరువులో వేలాది లోడ్ల మట్టిని తోడి ఇప్పుడు చెరువు కనిపించకుండా చేసేశారు. ఇంత జరుగుతున్నా ఆ మండలానికి చెందిన సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. గత ఏడాది నుంచి ఆ చెరువును ధ్వంసం చేసి జేసీబీలతో చెరువులోని మట్టిని అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవే దెబ్బకు ఇలాంటి చెరువులు ఎన్నో నాశనమయ్యాయి.

నీళ్లు లేకుండా చేసేందుకు బంకమట్టిని తోడి..

సాధారణంగా వర్షాలు పడినప్పుడు వాగుల ద్వారా వచ్చే వరదనీటితో పాటే ఇసుక, మట్టి చెరువుల్లోకి చేరుతోంది. ఇవి చెరువులో నీటి అడుగుభాగంగా ఒండ్రుమట్టిగా మారి బంకమన్నుగా రూపాంతరం చెంది నీరు భూమిలోకి ఇంకిపోకుండా అడ్డుకుట్టుంది. బంకమట్టి కారణంగా చెరువుల్లో ఎక్కువకాలం నీరు ఉండేది. కాని అక్రమార్కులు చెరువుల్లోని బంకమట్టిని, దానికింద ఉన్న ఇసుకను వదలడం లేదు. మరోవైపు ఈ ప్రాంతంలో సాగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం రోడ్డుకు దగ్గరగా ఉన్న చెరువుల్లో నుంచి మట్టిని తరలించి చెరువుల ఉనికే లేకుండా చేసేస్తున్నారు. బైరెడ్డిపల్లి మండలంలోని కొత్తిండ్లుచెరువు మాత్రమే కాదు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్వాహకుల దెబ్బకు దేవదొడ్డి, తీర్థం, కోట్రీపల్లి, బైరెడ్డిపల్లి, కమ్మనపల్లి, బురిశెట్టిపల్లి, పలమనేరు మండలంలోని బేలుపల్లి, కొలమాసనపల్లి, మాదిగబండ, మొరం పంచాయతీల్లో కొత్తగా నిర్మిస్తున్న రోడ్డుకు సమీపాల్లోని చెరువులను సర్వనాశనం చేశారు. ఇకపై వర్షాలు పడినా ఈ చెరువుల్లో చుక్కనీరు నిల్వ ఉండదు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి చెరువులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కుప్పం 'కిక్కే' వేరప్పా..!

- 10 మద్యం షాపులకు 275 టెండర్లు
- టెండరుదారుల్లో ముగ్గురు మహిళలు..!
- నేడు మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో మద్యం షాపులకు దరఖాస్తులు పోటాపోటీగా పడుతున్నాయి. నియోజకవర్గంలో 10 మద్యం షాపులను కేటాయించి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. గురువారం నాటికి మొత్తం 275 దరఖాస్తులు ఎక్సైజ్ శాఖకు వచ్చాయి. టెండరు వేయడానికి రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ సొమ్ము తిరిగి చెల్లించరు. కాబట్టి కుప్పం షాపులకు పోటీ ఉండదని అధికారులు ఊహించారు. దీనికి భిన్నంగా పది మద్యం దుకాణాలకు వెల్లువలా దరఖాస్తులు రావడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. దరఖాస్తుదారుల్లో ముగ్గురు మహిళలు సైతం ఉండటం విశేషం! ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలోని 5 షాపులు, గుడుపల్లె మండలానికి కేటాయించిన ఒకే ఒక్క షాపునకు 34 దరఖాస్తులు వేశారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో అధికంగా మద్యం షాపులకు దరఖాస్తులు అందినవాటిలో కుప్పం టాప్‌లో నిలిచింది. ప్రభుత్వం మద్యం షాపులకు టెండర్ల గడువు పెంపు శుక్రవారంతో ముగియనుండడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ప్రజా పరిష్కార వేదికలో అర్జీల వెల్లువ

- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్
- పాల్గొన్న జిల్లాస్థాయి అధికారులు

నగరి : ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. గురువారం నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు సంబంధించి నిర్వహించిన ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 200లకు పైగా వినతులు వచ్చాయి. వీటిని ఎమ్మెల్యే భానుప్రకాష్ సమక్షంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి పరిశీలించి వాటిని పరిష్కరించాలంటూ సంబంధిత శాఖల వారికి కేటాయించి ఆదేశాలు జారీచేశారు.



ఎమ్మెల్యే సమక్షంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి

అందులో ప్రధానంగా ఏకాంబరకుప్పం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని, ఉదయం 7.10 గంటలకు వచ్చే చెన్నై–తిరుపతి ట్రైన్‌ను పునరుద్ధరించాలని, గ్యాస్ పంపిణీలో సిలిండర్ ధర రూ.880 తీసుకుంటున్నా డోర్ డెలివరీ చేయడం లేదని, ఓటీపీ సిస్టమ్‌తో గ్యాస్ బుకింగ్‌ను మార్చాలని కోరారు. అలాగే నగరి–బెంగళూరు మధ్య ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేయాలని, పట్టణ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న క్వారీలను నిలిపివేయాలని, పెన్షన్లు, ఇంటి పట్టాలు తదితర సమస్యలపై అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరెడ్డి, ఎంపీపీ భార్గవి, జిల్లా అధికారులు జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఏడీ సర్వే గౌస్ బాషా, ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డీఎల్‌డీఓ రవికుమార్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి, నగరి తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సతీష్ వివిధ సంబంధిత శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు

ఒకరే ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోండి

- మద్యంషాపుల కిస్తీ 6 విడతల్లో కట్టవచ్చు
- ఇతర రాష్ట్రాల వారు కూడా దరఖాస్తు వేయవచ్చు
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

నగరి : లాటరీ పద్ధతిలో కేటాయించే షాపులకు లైసెన్సు ఫీజు(కిస్తీ) ఆరు విడతల్లో కట్టుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని చిత్తూరు, తిరుపతి జిల్లాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ తలమల విజయశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి విచ్చేసిన ఆయన సిబ్బందికి మద్యం దుకాణాలకు సంబంధించి విధివిధానాలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరి ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన 11 షాపులకు గాను ఇప్పటివరకు 160 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం రెండు రోజులు గడువు పొడిగించిందని, శుక్రవారం రాత్రి 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోటీకి రాష్ట్ర సరిహద్దుతో సంబంధం లేదని, ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే ఒకరే ఎన్ని దరఖాస్తులైనా వేసుకోవచ్చన్నారు. httpr://hpfrpsoject.com ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సందేహాలను టోల్‌ఫ్రీ 040–42425520 నంబరుకు లేదా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9110902548, ఎస్‌ఐ 8985603534 నంబర్లకు చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ నెల 14వ తేదీన చిత్తూరు–కాణిపాకం రోడ్డులోని ఆర్‌ఆర్ గార్డెన్స్ మాణిక్యమ్మ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ తీస్తామన్నారు. ఏఈఎస్ సుబ్రహ్మణ్యం, సీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

నలుగురికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం : రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు..నెలవాయి గ్రామానికి చెందిన మధు గురువారం కారులో పళ్లిపట్టుకు వెళ్తుండగా చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి సానకుప్పం మలుపు వద్ద చెరుకు ట్రాక్టర్‌ను తప్పించే యత్నం చేయగా, అదే సమయంలో ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. అందులో దిగువ ముద్దుకుప్పంకు చెందిన దొరబాబు, నెలవాయి కొత్తఇండ్లుకు చెందిన మధు, తిరుమల, చంద్ర ఉన్నారు. వీరిని స్థానికులు 108 వాహనంలో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): స్కానింగ్ సెంటర్లల్లో లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆర్డీఓ శ్రీనివాసులు, జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ అన్నారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో గురువారం పీసీపీఎన్‌డీటీ యాక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీతో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతి పొందిన ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో ప్రాక్టీసులు జరగాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లు నడిపితే నిర్వాహకులపై కఠిన చర్యలు చేపట్టాలని, అనుమతి లేకుండా అబార్షన్లు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. రేడియాలజిస్ట్ మాత్రమే స్కానింగ్ చేయాలని, ఎవరైనా లింగ నిర్ధారణ చేస్తే యాక్ట్ ప్రకారం మూడేళ్లు జైలు తప్పదన్నారు. ప్రస్తుతం లింగ నిష్పత్తి 1000 బాలురకు 883 బాలికలు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఆడ, మగపిల్లల నిష్పత్తి సమానంగా ఉండాలని, మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మాత్రలు విక్రయించకూడదన్నారు. అనంతరం అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు శిరీష, కీర్తన, జయంతి, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడితే సస్పెండ్ చేస్తారా ?



మాట్లాడుతున్న జీవీ రమణ

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్టీయూ రాష్ట్ర నేత గంటామోహన్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఫ్యాప్టో (ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) డిప్యూటీ సెక్రటరీ జనరల్ జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ప్రశ్నించారనే అక్కసుతో గంటామోహన్‌ను సస్పెండ్ చేయడం సరి కాదన్నారు. టీచర్ల సమస్యలపై పోరాటాలు చేయడం సంఘ నాయకుల బాధ్యత అన్నారు. సమస్యలపై ధర్నా చేస్తే సస్పెండ్ చేస్తారా ? అని ప్రశ్నించారు. చైర్మన్ మునాఫ్ మాట్లాడుతూ వెంటనే గంటామోహన్ సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమస్యల పట్ల పోరాటం చేయడం సంఘ నాయకుల ప్రథమ కర్తవ్యం అని గుర్తుచేశారు. అనంతరం సంఘ నాయకులు డీఈఓ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై డీఈఓ మాట్లాడుతూ మంచి నాయకుల పట్ల తనకు గౌరవం ఉందని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీంతో శుక్రవారం చేపట్టాల్సిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఫ్యాప్టో సంఘాల నాయకులు ప్రకటించారు. సమావేశంలో ఫ్యాప్టో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.